## సంక్షిప్తం..

**భూమనకు ఆహ్వానం**

**తిరుపతి మంగళం :** సత్యవేడు నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించనున్న పార్టీ నియోజకవర్గ సమావేశానికి చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డిని ఆ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆహ్వానించారు. పార్టీ నాయకులు బీరేంద్రవర్మ ఉన్నారు.

**ఘనంగా బ్రెయిలీ దినోత్సవం**

**తిరుపతి ఎడ్యుకేషన్ :** తిరుపతి బైరాగిపట్టెడలోని ఎంజీఎం పాఠశాల ఆవరణలో శనివారం ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ బ్రెయిలీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి డీవైఈఓ బాలాజీ పాల్గొని మాట్లాడారు.

**ఉత్తమ ఉపాధ్యాయురాలిగా తవిత తులసి**

**తిరుపతి సిటీ:** పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ తవిత తులసికి సావిత్రీబాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మాండేలే, సినీ నటి రేణు దేశాయ్, హాస్య నటుడు బ్రహ్మానందం ముఖ్యఅతిథులుగా విచ్చేసి అవార్డులను అందజేశారు.

**హథీరాంజీ మఠం ఇన్‌చార్జ్‌గా బాపిరెడ్డి**

**తిరుపతి కల్చరల్:** శ్రీస్వామి హథీరాంజీ మఠం ఇన్‌చార్జ్ పాలనాధికారిగా శ్రీకాళహస్తి ఈవో, డెప్యూటీ కలెక్టర్ టీ.బాపిరెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

**వెండి ఆభరణాల వితరణ**

**తిరుపతి సిటీ:** యునైటెడ్ ఏపీ కేబుల్ అండ్ టీవీ ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి శనివారం శ్రీవారికి వెండి ఆభరణాలను అందజేశారు. ఈ మేరకు టీటీడీ చైర్మన్‌ను అలిపిరిలో కలసి వరద హస్తం, కటి హస్తం, సిల్వర్ సాండిల్స్ వంటి రూ.5 లక్షల విలువచేసే ఆభరణాలను అందజేశారు.

**పోస్టర్ ఆవిష్కరణ**

**తిరుపతి కల్చరల్:** నగరంలోని మహతి కళాక్షేత్రంలో డాలర్స్ గ్రూప్ సహకారంతో మెగా ఇంపాక్ట్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీల్లో రెండు రోజుల ఉచిత అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు డాలర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఇంపాక్ట్ ప్రతినిధులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

**ఘనంగా ప్రపంచ అంధుల దినోత్సవం**

**తిరుపతి గాంధీ రోడ్:** ప్రపంచ అంధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి కపిలతీర్థం సమీపంలోని ప్రభుత్వ అంధుల శరణాలయంలో బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**స్థానికులకు శ్రీవారి దర్శనం టోకెన్లు**

**తిరుమల:** ప్రతి నెలా మొదటి మంగళవారం (జనవరి 07) స్థానికులకు కల్పించే దర్శనంలో భాగంగా ఆదివారం తిరుపతి మహతి ఆడిటోరియంలోని కౌంటర్లలో, తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్లో శ్రీవారి దర్శన టోకెన్లు జారీ చేయనున్నారు.

**స్క్రాప్ తరలింపుపై సమగ్ర విచారణ చేపట్టాలి**

**తిరుపతి కల్చరల్:** ఎస్వీ యూనివర్సిటీలో స్క్రాప్ కుంభకోణానికి కారణమైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు.

**వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం**

**భాకరాపేట :** వాహనం సహా 13 ఎర్రచందనం దుంగలను, కారును స్వాధీనం చేసుకుని స్మగ్లర్‌ను అరెస్ట్ చేసినట్లు భాకరాపేట ఫారెస్ట్ రేంజర్ వెంకట్రమణ తెలిపారు.



# అన్నా.. నీకిది తగునా..!

- ప్రజా అవసరాల దృష్ట్యా ర్యాంపు నిర్మించేందుకు అధికారుల యత్నం
- అడ్డుకున్న టీడీపీ నేత అన్నా రామచంద్రయ్య
- నా అనుమతి లేకుండా ఎలా వేస్తారంటూ దురుసు ప్రవర్తన


అధికారులతో వాగ్వాదం చేస్తున్న అన్నా రామచంద్రయ్య

**తిరుపతి టాస్క్‌ఫోర్స్:** గత ప్రభుత్వ హయాంలో తిరుపతి నగరం నుంచి జీవకోనకు వెళ్లే మాస్టర్ ప్లాన్ రోడ్డును విస్తరించి, సత్యనారాయణపురం నుంచి మున్సిపల్ పార్కు సమీపంలోని రత్నం స్కూల్ వరకు అత్యంత సుందరంగా అభివృద్ధి చేశారు. అక్కడి నుంచి మున్సిపల్ పార్క్ ఎదురుగా తిరుమల బైపాస్ రోడ్డుకు లింక్ చేసేందుకు మరో 70 మీటర్ల మేర పెండింగ్‌లో ఉంది. రోడ్డు విస్తరణలో ఇరువైపులా స్థల యజమానులు కోర్టుకెక్కారు. పది అడుగుల మున్సిపల్ రోడ్డుకు ఇరువైపులా 15 అడుగుల చొప్పున స్థలం తీసుకోవాలని అన్నా రామచంద్రయ్య.. అలా కుదరదు మాస్టర్‌ప్లాన్ రోడ్డు ప్రకారమే రోడ్డు నిర్మించాలని ప్రతివాది భవన యజమాని డిమాండ్ చేస్తున్నారు. తుడా మాస్టర్ ప్లాన్ అంటే శాసనంతో సమానమని, అలా కాకుండా తన భవనం పైకి రోడ్డు మళ్లించాలని చూడడం అన్యాయమని ఆ వ్యక్తి కోర్టు మెట్లు ఎక్కారు. దీంతో ఆ 70 మీటర్ల పరిధిలో రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. దీంతో స్థానికులు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తమ పరిధిలోని 10 అడుగుల రోడ్డును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంకల్పించారు. ఈ క్రమంలోనే తిరుమల బైపాస్ రోడ్డు నుంచి కొంతదూరం వరకు ర్యాంపుల రోడ్డును తాత్కాలికంగా నిర్మించాలని శనివారం కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టగా టీడీపీ నాయకుడు అన్నా రామచంద్రయ్య తన అనుచర వర్గంతో అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో పనులు జరగనివ్వనని తేల్చి చెప్పారు. నిర్మాణ పనులు చేస్తున్న టౌన్ ప్లానింగ్ ఇంజినీర్ల అధికారులతో దురుసుగా వ్యవహరించారు. ఆయన వ్యవహార శైలి చూసిన స్థానిక ప్రజలు విస్తుపోయారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 10 అడుగుల రోడ్డును సైతం ఆయన అభివృద్ధి చేయనీయకుండా దౌర్జన్యం చేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తన అనుమతి లేకుండా పనులు చేస్తారా ? అంటూ అధికారులపై కయ్యమని లేవడంతో చేసేదిలేక అధికారులు వెనుదిరిగారు.


రోడ్డు పనులను అడ్డుకునేందుకు అనుచరులతో వస్తున్న అన్నా రామచంద్రయ్య

**నాకే ఎదురు చెబుతారా...!**

ప్రజల మేలు కోరుకోక పోగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై ఆయన మీసం మెలేశారు. రోడ్డుకు ఇరువైపులా 15 అడుగులు విస్తరించకుండా పనులు ఎలా చేస్తారని గట్టిగా నిలదీశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 10 అడుగుల రోడ్డును మాత్రమే తాము తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నామని చెప్పినా ఆయన పెడచెవిన పెట్టారు. నాకే ఎదురు చెబుతారా? మా ప్రభుత్వ హయాంలో నాకు వ్యతిరేకంగా చేస్తారా? నా అనుమతి లేకుండా ఎలా వచ్చారు ? అంటూ తీవ్ర స్థాయిలో అధికారులపై విరుచుకుపడ్డారు. అంతటితో ఆగకుండా గత ప్రభుత్వం పైనా, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, ఆయన తనయుడు మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డిపైన రాజకీయ విమర్శలు, అవినీతి ఆరోపణలు చేశారు. స్థలం కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లు ఇవ్వకుండా రోడ్డును అభివృద్ధి చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు.

# మీ గెలుపుకోసం పనిచేస్తే గుర్తింపు లేదు

- ఆరు నెలలుగా తీవ్ర నిరాశలో కార్యకర్తలు
- ఎమ్మెల్యే నాని కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కుమార్‌రాజారెడ్డి

**సాక్షి, టాస్క్‌ఫోర్స్:** ''మీ గెలుపు కోసం ఎంతోమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు పని చేశారు. మీరు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత, కార్యకర్తలను పట్టించుకోకపోవడంతో వారు తీవ్ర నిరాశతో ఉన్నారు. మీరు కార్యకర్తలను కూడా గుర్తించాలి'' అంటూ టీడీపీ సీనియర్ నాయకుడు, సీఎం చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు కుమార్‌రాజారెడ్డి, ఎమ్మెల్యే పులివర్తి నానికి సూచించడం హాట్ టాపిక్‌గా మారింది. శనివారం చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోని ఓ కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నానితో పాటు టీడీపీ నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు కుమార్ రాజారెడ్డి మాట్లాడుతూ.. చంద్రగిరిలో టీడీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడ్డారన్నారు. మీరు ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి నేటివరకు కార్యకర్తలను పట్టించుకోకపోవడంతో వారు తీవ్ర నిరాశలోకి కూరుకుపోయారంటూ సభాసాక్షిగా తెలిపారు. గత ఆరు నెలలుగా కార్యకర్తలు మిమల్ని కలవాలంటే కూడా ఇబ్బందులు తప్పడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మీకోసం..మీ వెంట నడిచిన కార్యకర్తలను కాస్త గుర్తించాలంటూ ఆయన ఎమ్మెల్యే నానిని కోరారు. వెంటనే ఎమ్మెల్యే నాని.. ఇక్కడ రాజకీయాల గురించి వద్దని, తర్వాత చూసుకుందామంటూ ఆయనకు తెలిపారు.

**తమ్ముళ్లలో చర్చకు లేపిన కామెంట్స్**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నేతల్లో ముందున్నంత జోష్ కనిపించడం లేదన్నమాటకు శనివారం ఆ పార్టీ సీనియర్ నాయకుడు చేసిన కామెంట్స్‌కు బలం చేకూరుతున్నాయి. చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేగా పనిచేసిన నాటి నుంచి కుమార్ రాజారెడ్డి టీడీపీలోనే కొనసాగుతున్నారు. సీనియర్ నేత అయిన ఆయన, టీడీపీ కార్యకర్తలను ఎమ్మెల్యే నాని పట్టించుకోవడం లేదని ఆయన సమక్షంలోనే మాట్లాడడంతో తెలుగు తమ్ముళ్లు తీవ్ర స్థాయిలో చర్చించుకున్నారు. ఆరు నెలల్లో పార్టీ కార్యకర్తలకు ఎమ్మెల్యే నాని సరైన గుర్తింపు ఇవ్వలేదని, తనకు ఆదాయం సమకూర్చే వాళ్లను తప్ప, మిగిలిన వారిని పట్టించుకోవడం లేదని చర్చించుకోవడమే కాకుండా తమ మనసులో మాట ఎమ్మెల్యే ఎదుటే చెప్పిన కుమార్ రాజారెడ్డిని అభినందించారు.

# ఈత రాక.. ఊపిరాడక!

**శ్రీకాళహస్తి:** విహారంలో విషాదం నెలకొంది. శ్రీకాళహస్తికి చెందిన ఆరుగురు యువకులు రైల్వే కోడూరు సమీపంలోని గుంజనేరు జలపాతం వద్దకు శుక్రవారం వెళ్లారు. ఈ ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా.. ఐదుగురు సురక్షితంగా బయటపడ్డారు. బంధువులు, స్థానికుల వివరాలు.. శుక్రవారం ఉదయం 7గంటల ప్రాంతంలో శ్రీకాళహస్తికి చెందిన దినేష్, గిరి, కేదార్, పీ.దినేష్, మోహన్, దత్తసాయి(25) అనే ఆరుగురు యువకులు విహార యాత్రకని గుంజనేరు జలపాతం వద్దకు వెళ్లారు. అక్కడ సరదాగా ఈతకొట్టేందుకు ప్రయత్నించారు. అయితే వారిలో ఒకరిద్దరికి తప్ప మిగిలిన వారికెవ్వరికీ ఈత రాదు. ఈ క్రమంలో దత్తసాయి లోతైన ప్రాంతానికి వెళ్లడంతో ఊపిరాడక సాయంత్రం 3.30గంటల ప్రాంతంలో మృతి చెందాడు. మృతుని స్నేహితులు దత్తసాయి తల్లిదండ్రులకు సమాచారం చేరవేశారు. వారు రైల్వే కోడూరు, రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. తర్వాత బంధువులు, అటవీశాఖ అధికారులు, పోలీసులు కలిసి కోడూరు రైల్వేస్టేషన్‌కు 15 కిలోమీటర్ల దూరంలో శేషాచలం అడవుల్లో గల జలపాతం వద్దకు అర్ధరాత్రి 12 గంటలకు చేరుకున్నారు. వేకువ జాము రెండు గంటల ప్రాంతంలో దత్తసాయి మృతదేహాన్ని కోడూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చి పోస్టుమార్టం అనంతరం శ్రీకాళహస్తికి తరలించారు.


దత్తసాయి (ఫైల్)

**ఒక్కడే కొడుకు**

దత్తసాయి తండ్రి ఈశ్వరరెడ్డి చిరుద్యోగి. తల్లి ఓ ప్రయివేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. వారికి కుమార్తె, కుమారుడు దత్తసాయి ఉన్నారు. కుమార్తె బీటెక్ చదువుతుండగా.. పెద్దవాడైన దత్తసాయి ఓపెన్ డిగ్రీ చేసి ఖాళీగా ఉంటున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు దూరమవడంతో కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కలచివేసింది.

# పరీక్ష నెగ్గితేనే పింఛన్

- రేపటి నుంచి తనిఖీలు
- ఒక్కో బృందంలో ముగ్గురు డాక్టర్లు, ఒక డిజిటల్ అసిస్టెంట్
- జిల్లాకు నెల్లూరు, అన్నమయ్య జిల్లా నుంచి డాక్టర్లు
- సెక్యూరిటీ ఇవ్వాలని కోరిన వైద్యులు

**తిరుపతి అర్బన్:** పింఛన్ లబ్ధిదారులపై కూటమి ప్రభుత్వం పగబట్టినట్టుంది. అర్హత పరీక్ష పేరుతో ఏరివేతకు శ్రీకారం చుడుతోంది. వారు పెట్టే పరీక్షలో నెగ్గితేనే ఇకపై పింఛన్ అందుతుంది. లేదంటే కడుపు మాడ్చుకోవాల్సిన పరిస్థితే ఏర్పడుతుంది.

**జిల్లాలో 27 రకాల పింఛన్లు**

జిల్లాలో ప్రతినెలా 27 రకాలకు చెందిన 2,64,636 మంది లబ్ధిదారులకు రూ.112.25 కోట్ల మేర పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడు నెలల్లోనే అందులో 7,188 మందిని తగ్గించారు. మరింత మందిని తగ్గించే ప్రయత్నంలో భాగంగా పలు దశలుగా పింఛన్ల తనిఖీలు చేపట్టనున్నారు. ఈ మేరకు సోమవారం నుంచి జిల్లాలో ఏడు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టనున్నారు. ఇందులో ముందుగా రూ.15వేలు పొందుతున్న పింఛన్‌దారులను తనిఖీ చేయనున్నారు.

**సెక్యూరిటీ ఇవ్వండి సర్**

సోమవారం నుంచి పింఛన్ తనిఖీలు మొదలుపెట్టనున్న నేపథ్యంలో ఒక్కో బృందంలో ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు, ఒక పీహెచ్‌సీ డాక్టర్, సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అయితే సదరన్ సర్టిఫికెట్లు జిల్లా డాక్టర్లు ఇవ్వడంతో.. అదే డాక్టర్లు తనిఖీలు చేయడం సరికాదని నిర్ణయించారు. దీంతో నెల్లూరు, అన్నమయ్య జిల్లా నుంచి 14 మంది స్పెషలిస్ట్ డాక్టర్లు తిరుపతి జిల్లాకు నియమించారు. ఈ క్రమంలో డాక్టర్లు తనిఖీల సమయంలో తమకు భద్రత కావాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలుస్తోంది. దీంతో ఒక్కో బృందానికి ఒక పోలీస్‌ను ఏర్పాటు చేయనున్నారు.

**మొదటి దశ ఇలా..**

మంచానికే పరిమితమై పక్షవాతంతోపాటు తీవ్రమైన మస్కులర్ డిస్ట్రోఫీ సమస్యలు ఉండి జిల్లాలో నెలకు రూ.15 వేలు పింఛన్ పొందుతున్న 1,200 మందిని మొదట పరిశీలించనున్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి రోగుల ఇంటి వద్దకే వెళ్లి అర్హత పరీక్షలు చేపట్టనున్నారు. ఈ నెల 31కి తనిఖీల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. రోజుకు 25 మంది చొప్పున పరీక్షించనున్నట్టు సమాచారం.

**రెండో దశ ఇలా**

రెండో దశలో విభిన్న ప్రతిభావంతులతోపాటు కళాకారులు, వివిధ రోగాలకు చెందిన 23 రకాల పింఛన్‌దారుల 59,565 మందిని ఫిబ్రవరి 1వ తేదీ నుంచి తనిఖీ చేయనున్నారు.

**మూడో దశలో..**

మూడో దశలో మార్చి నుంచి జిల్లాలో వితంతువుల పింఛన్లు పొందుతున్న 70,341 మందివి తనిఖీ చేయనున్నారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 1 వరకు మాత్రమే భర్త చనిపోయి వితంతువులైన వారికి 240 మంది కూటమి ప్రభుత్వం జిల్లాలో కొత్తగా పింఛన్లు మంజూరు చేసింది. నవంబర్ 1కి ముందు భర్త చనిపోయి వితంతువు అయితే వారు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇవ్వకపోవడం గమనార్హం.

**నాల్గో దశలో..**

4వ దశలో పింఛన్లు పొందుతున్న 1,32,890 మంది వృద్ధులను ఏప్రిల్‌లో తనిఖీ చేయనున్నారు. ఇప్పటికే ఈ ఏడు నెలల కాలంలో 7,188 మందిని తొలగించిన సంగతి తెలిసిందే. ఎందుకుని అధికారులను ప్రశ్నిస్తే వారంతా మృతి చెందారని సమాధానం ఇస్తున్నారు.

**6 నుంచి తనిఖీలు**



ఈ నెల 7వ తేదీ నుంచి పింఛన్లు తనిఖీ చేస్తాం. ముందుగా రూ.15వేలు పొందుతున్న వారి ఇంటికి వెళ్లి వైద్య బృందంతోపాటు కమిటీలోని సభ్యులు పరీక్షలు చేపడుతారు. అర్హులా కాదా అనే అంశాలను నిర్ధారణ చేస్తారు. తర్వాత దశల వారీగా తనిఖీలు ఉంటాయి.

–శోభనబాబు, డీఆర్‌డీఏ పీడీ, తిరుపతి జిల్లా

**పారదర్శకంగా తనిఖీ**



పింఛన్ల తనిఖీలు పారదర్శకంగా ఉండాలి. నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవు. అడ్డదిడ్డంగా తనిఖీలు చేస్తే క్రిమినల్ కేసులు సైతం నమోదు చేస్తాం. తనిఖీలు చేపడుతున్న బృందాలకు అన్ని శాఖల అధికారులు సహకరించాలి. తనిఖీలపై ప్రత్యేక నిఘా ఉంటుంది.

–ఎస్. వెంకటేశ్వర్, కలెక్టర్

**12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం**

**తిరుపతి మంగళం :** శేషాచలం అటవీ ప్రాంతంలో 12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఒక స్మగ్లర్‌ను శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీలు జీ. బాలిరెడ్డి, వీ.శ్రీనివాసరెడ్డి, ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ టీమ్ శుక్రవారం రాత్రి తిరుమల శేషాచలం అడవుల్లో కూంబింగ్ చేపట్టినట్టు ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. శనివారం అటవీ ప్రాంతంలో ఒక వ్యక్తి తచ్చాడుతూ కనిపించాడని, అతను పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకుని, విచారించినట్టు వెల్లడించారు. దాంతో ఒక డంప్‌లో దాచి ఉంచిన 12 ఎర్రచందనం దుంగలు చూపించాడన్నారు. అతను తమిళనాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించి అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేశారు.

**వైకుంఠ ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన**

**తిరుమల:** వైకుంఠ ద్వార దర్శనం కోసం తిరుమలలో జరుగుతున్న ఏర్పాట్లను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈఓ శ్యామలరావు, అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి, ఇతర అధికారులతో కలిసి చైర్మన్ ముందుగా స్థానిక బాలాజీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఎస్ఎస్‌డీ టోకెన్ జారీ కౌంటర్లను పరిశీలించారు. కార్యక్రమంలో టీటీడీ జేఈఓలు, సీవీఎస్వో శ్రీధర్, ఎస్పీ సుబ్బరాయుడు, సీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

**అంతర్జాతీయ సదస్సులో అధ్యాపకులు**

**తిరుపతి సిటీ:** కేరళలోని తిరువనంతపురం రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీలో ఏబీఆర్ఎస్ఎం ఆధ్వర్యంలో భారతీయ శాస్త్రం, సంస్కృతి, సంప్రదాయ జ్ఞానం–ఆధునిక ఆవిష్కరణలు అనే అంశంపై రెండు రోజులు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని వర్సిటీల నుంచి సుమారు 20 మంది పాల్గొనగా ఎస్వీయూ నుంచి పలువురు ఏబీఆర్ఎస్ఎం అధ్యాపకులు హాజరయ్యారు.

**కమ్యూనిటీ భవనం కూల్చివేత**

**తిరుపతి మంగళం:** మంగళం తిరుమలనగర్ పంచాయతీలోని కోళ్ల ఫారాలలో ఉన్న ఏళ్ల నాటి కమ్యూనిటీ భవనాన్ని కొందరు ఆక్రమణదారులు శనివారం కూల్చివేశారు. దాంతో కోళ్ల ఫారంలోని స్థానిక ప్రజలు అక్కడికి చేరుకుని కమ్యూనిటీ భవనాన్ని ఎలా కూల్చుతారంటూ ఆక్రమణదారులతో వాగ్వాదానికి దిగారు. 1985లో అప్పటి సీఎం ఎన్టీ రామారావు తమకు సర్వే నం.228లో ఒక్కొక్కరికి 50 సెంట్ల చొప్పున ఇచ్చారన్నారు. భవనం కూల్చివేత విషయం తెలిసి అధికారులు అక్కడి చేరుకుని ఆక్రమణను అడ్డుకున్నారు. వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## సంక్షిప్తం..

**వీసీకి వినతి**

**తిరుపతి సిటీ:** అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నుంచి కమీషన్ల పేరిట వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు డిమాండు చేశారు. వారు శనివారం ఎస్వీ యూ వీసీ అప్పారావుకు వినతి పత్రం సమర్పించారు. ఎస్వీయూలో 120మందికి పైగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తుంటే వారికి నెలకు రూ.12 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని, అందులోనూ ప్రతి నెలా రూ.5 వేలు చొప్పున కమీషన్ టెండర్ దక్కించుకున్న వ్యక్తికి ఇవ్వాలని కొందరు పీడించడం దారుణమన్నారు. పలు విద్యార్థి విభాగాల నేతలు పాల్గొన్నారు.

**స్విమ్స్‌లో నిరంతర వైద్య విద్య**

**తిరుపతి తుడా:** స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్యా కార్యక్రమం శనివారం పద్మావతి ఆడిటోరియంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. చెన్నైకి చెందిన రేవన్ హెల్త్ స్ట్రోక్ – ఆర్థో రిహాబిలేషన్ డాక్టర్ శ్యామ్ శస్త్రచికిత్స నుంచి నొప్పిని తగ్గించడం, కండరాలు, ఎముకలు, కీళ్ల నయం చేయడంలో సిద్ధహస్తుడని, ఆయన అనుభవాలు స్విమ్స్‌తో పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు.

**ఈఎస్ఐలో సిబ్బంది కొరత తీర్చాలి**

**తిరుపతి కల్చరల్:** ఈఎస్ఐ ఆస్పత్రిలో సిబ్బంది కొరతను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఎల్.రత్నకుమార్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**'ఆ ఆరోపణలు నిరాధారం'**

**తిరుపతి సిటీ:** ఎస్వీయూలో గత రెండు రోజులుగా తుక్కు విక్రయాలపై వస్తున్న ఆరోపణలు నిరాధారమని, పత్రికల్లో వస్తున్న కథనాలు సత్యదూరమని వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. శనివారం ఆయన తన చాంబర్‌లో స్క్రాప్ కమిటీతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. దీనిపై కొందరు వ్యక్తులు అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారని, వర్సిటీ పరువు తీయొద్దని ఆయన కోరారు. అనుమానం ఉంటే ఆర్టీఐ యాక్ట్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. సమావేశంలో రిజిస్ట్రార్ భూపతి నాయుడు, స్క్రాప్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక**

**తిరుపతి కల్చరల్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ సోలార్ వెంటర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మణికండన్ పిలుపునిచ్చారు. శనివారం ఓ ప్రైవేటు హోటల్లో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు.

**మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం**

**పాకాల :** స్థానిక ప్రభుత్వ బాలురు, బాలికల జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ ఉమామహేశ్వరి, బేబీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి ప్రారంభించారు.




## ప్రధాన నగరాలతో ఆధ్యాత్మిక నగరం పోటీ



**తిరుపతి సిటీ:** ఆధ్యాత్మిక నగరం తిరుపతి దేశంలోని ప్రధాన నగరాలతో పోటీపడుతోంది. ఆధ్యాత్మిక టూరిజంతో పాటు పారిశ్రామిక, విద్య, వైద్య రంగాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం నగర స్వరూపాన్ని మార్చివేసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు నగర శివార్లలో ఏర్పాటు కావడం, అంతర్జాతీయ ప్రమాణాలతో వైద్య సేవలను అందించే మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు పెద్దఎత్తున నగరంలో ఏర్పాటయ్యాయి. ఐటీ పరిశ్రమలు, వస్త్ర వ్యాపార రంగాలు తిరుపతికి తలమానికంగా మారాయి. దీంతో పాటు తిరుపతికి అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో రూపురేఖలు మారాయి. బడా వ్యాపారవేత్తలు, ఎంఎన్‌సీ కంపెనీలు నగర అభివృద్ధిని కాంక్షించి రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్స్ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలోనే తిరుపతి నగరంలో స్థిర నివాసం కోసం ఆసక్తి చూపుతున్నారు. ఆధునిక హంగులతో గృహాలను నిర్మిస్తున్న పేరొందిన బిల్డర్లను సంప్రదించి కొనుగోలు చేస్తున్నారు.

**ఎడ్యుకేషనల్ హబ్‌గా తిరుపతి**

ఆధ్యాత్మిక నగరం తిరుపతి ఎడ్యుకేషనల్ హబ్‌గా పేరుగాంచింది. ఐఐటీ, ఐజర్ వంటి విద్యాసంస్థల రాకతో పాటు నగరంలో ఏడు ప్రధాన వర్సిటీలు దేశ, విదేశీ విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో ప్రాథమిక విద్యను అందిస్తున్న మరెన్నో ప్రైవేటు స్కూళ్లు నగరంలో ఏర్పాటు కావడంతో ప్రజలు నగరబాట పడుతున్నారు.

## ఉత్తమ సేవలకు మార్గదర్శి బ్రైట్ ఎలక్ట్రానిక్స్


సురేష్‌బాబు, బ్రైట్ ఎలక్ట్రానిక్స్

**తిరుపతి :** గత 15 ఏళ్లుగా రాయలసీమ అంతటా ఉత్తమ సేవలు అందిస్తూ వినియోదారుల ప్రశంసలు అందుకుంటున్నట్లు బ్రైట్ ఎలక్ట్రానిక్స్ అధినేత సురేష్‌బాబు తెలిపారు. ప్రస్తుతం లక్ష్మీపురం సర్కిల్ వద్ద ఉన్న తమ సంస్థ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన ఎలక్ట్రానిక్ వస్తువులు అందిస్తోందన్నారు. అంతేగాకుండా తాము సియట్ టైర్లు, హిందుస్తాన్ పెట్రోలియం, లూబ్రికెంట్స్ స్పార్క్, మిండాతో పాటు ప్రపంచంలోని ప్రముఖ లూబ్రికెంట్ల ఉత్పత్తి వంటి ప్రముఖ బ్రాండ్ల అధీకృత పంపిణీదారుల సేవలందిస్తున్నట్లు చెప్పారు.

## మెడికల్ రంగంలోకి ఎస్‌బీబీ


కె.వి.చౌదరి, ఎస్‌బీబీ బ్రిక్స్ అధినేత

**తిరుపతి తుడా:** జిల్లా ప్రజలకు 40 ఏళ్లుగా ఎస్‌బీబీ సంస్థ ద్వారా వివిధ వ్యాపార రంగాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఆ సమస్త అధినేత కె.వి.చౌదరి అన్నారు. ఎస్‌బీబీ బ్రిక్స్, ఎస్‌బీబీ రెసిడెన్సీ నిర్వహిస్తున్నామని చెప్పారు. 18 నెలల కిందట మెడికల్ రంగంలోకి ప్రవేశించినట్లు తెలిపారు. ఎస్‌బీబీ మెడికల్ స్టోర్‌ను తిరుపతి తిలక్ రోడ్డులో స్థాపించామన్నారు. తమ వద్ద అన్ని ప్రముఖ కంపెనీల మందులు, బేబీ కేర్, మదర్ కేర్, పర్సనల్ కేర్, జనరల్ ఐటమ్స్, సర్జికల్స్‌ను సరసమైన ధరలకు అందిస్తున్నామన్నారు. కస్టమర్ల కోరిక మేరకు తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట, కరకంబాడి ప్రాంతాల్లో ఉచిత హోమ్ డెలివరీ సదుపాయం ఉందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యం


డాక్టర్ కె.సుధాకర్ నాయుడు

**తిరుపతి ఎడ్యుకేషన్ :** విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి వారికి ఉజ్వల భవిష్యత్తు అందించడమే తమ విద్యాసంస్థ లక్ష్యమని తిరుపతి రైల్వేకాలనీలోని మాతృశ్రీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.సుధాకర్‌నాయుడు తెలిపారు. అకడమిక్ చదువుతో పాటు క్రీడలు, లలిత కళల్లో శిక్షణ, అలాగే పోటీ పరీక్షలైన ఐఐటీ, నీట్‌కు అనుగుణంగా శిక్షణందించి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల నీట్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థిని కావేరి 648వ ర్యాంకు సాధించడం అలాగే ట్రిపుల్ ఐటీలో తమ విద్యార్థులు సీటు సాధించడం తమ విద్యా నైపుణ్యానికి నిదర్శనమని తెలిపారు.

## అధునాతన సౌకర్యాల కల్పన


వంశీకృష్ణారెడ్డి, డైరెక్టర్

**తిరుపతి సిటీ:** వినియోగదారులకు అధునాతన సౌకర్యాలను కల్పించి, వారి జీవన ప్రమాణ స్థాయిని పెంచడమే సురక్షా డెవలపర్స్ ప్రధాన లక్ష్యమని ఆ సంస్థ ఎండీ వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఏర్పేడు వెంకటగిరి రోడ్డులోని సురక్ష డెవలపర్స్ సంస్థ గృహ ప్రాజెక్టుల ద్వారా నిరంతరం ప్రగతిని సాధిస్తోందని ఆయన తెలిపారు. సంస్థ ఇప్పటికే ఏర్పేడులో విజయవంతంగా ఐదు గృహ ప్రాజెక్టులను పూర్తి చేసి, తాజాగా సురక్ష గార్డెన్ 6, 7 ప్రాజెక్టులను ప్రారంభించడం గర్వంగా ఉందన్నారు. ఆసక్తి ఉన్నవారు సురక్ష డెవలపర్స్ అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని, వివరాలకు 9845242662 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం


పసుపులేటి శివప్రసాద్, జీఎం

**తిరుపతి సిటీ:** సాధారణ, మధ్యతరగతి కుటుంబాల సొంతింటికల నెరవేర్చడమే లక్ష్యంగా అనంతరాజ్ ఆశ్రయ-2 లక్ష్యమని జనరల్ మేనేజర్ పసుపులేటి శివప్రసాద్ తెలిపారు. అనంతరాజ్ నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లో రూ.18 లక్షలకే ఫ్లాట్ అందిస్తున్నామని, దీంతో పాటు వడ్డీలేని ఐదు సులభ వాయిదాలను కస్టమర్లకు ఇవ్వడం జరుగుతోందన్నారు. 3 ఏళ్లలోపు నగదును పొదుపు చేసుకుని వాయిదాలను చెల్లించే వెసులబాటు ఉంటుందన్నారు. భవిష్యత్‌లో అనంతరాజ్ ఆశ్రయ ఇస్తున్న అందిస్తున్న ఫ్లాట్ రూ.30 నుంచి రూ.40 లక్షల వరకు ధర పలుకుతోందన్నారు. రేణిగుంట సమీపంలోని ఎయిర్‌పోర్టు, మెడికల్ కళాశాల, ఎంఎన్‌సీ కంపెనీలు, ఇంటర్నేషనల్ స్కూళ్లకు అతి సమీపంలో అనంతరాజ్ ఆశ్రయ-2 అపార్ట్‌మెంట్స్ నిర్మించడం జరిగిందన్నారు. రెంటల్ ఇన్‌కమ్‌కు అవకాశం ఉండే ప్రాంతంలో గృహాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆధునిక సదుపాయాలతో ఆహ్లాదకర వాతావరణంలో ఆరోగ్యవంతమైన జీవనాన్ని కల్పించడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. వివరాలకు 8639953289 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు కృషి


రంగనాథ్ మిర్తికం

**తిరుపతి సిటీ:** విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం తల్లిదండ్రులకు కెరీర్ మార్గదర్శకత్వంపై ప్రత్యేక ప్రపోజల్ రూపొందించినట్లు మిర్తిక్ సొల్యూషన్స్-హర్ష ఇన్ఫర్మేటిక్స్ డైరెక్టర్ రంగనాథ్ మిర్తికం తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మూడు దశాబ్దాల అనుభవం ఉన్న తమ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు ఇంటర్వ్యూలను సులువుగా ఎదుర్కొనేందుకు సన్నద్ధం చేసి వంద శాతం జాబ్ ఓరియంటెడ్ కోర్సును అందజేస్తున్నామని చెప్పారు. కోర్సు కాల వ్యవధి 3 నుంచి 6 నెలల పాటు ఉంటుందని, జనవరి 15వ తేదీ నుంచి కోర్సు ప్రారంభమవుతుందన్నారు. తొలివారంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి 20 శాతం ఫీజు రాయితీ ఉంటుందన్నారు. తిరుపతి కేటీ రోడ్డులోని భవానీనగర్ వద్ద ఉన్న సెంటర్ బిజినెస్ ఎన్‌క్లేవ్, మూడవ అంతస్తులోని మిర్తిక్ సొల్యూషన్స్ - హర్ష ఇన్ఫర్మేటిక్స్ సంస్థలో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 7093114446 నంబర్లలో సంప్రదించాలన్నారు.